సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం। 19। ఆగస్టు। 2023

I



చీనీ టన్ను రూ.18,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18,500 పలికాయి.



టమాట కిలో రూ.33

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.20 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.7°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పంట నమోదు తప్పనిసరి



బైరాపురంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

పుట్టపర్తి టౌన్: పంట వేసిన ప్రతి రైతూ రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తచెరువు మండలంలో బైరాపురం ఆర్‌బీకే కేంద్రం పరిధిలో నమోదు చేస్తున్న ఈ-క్రాప్ నమోదును జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వందశాతం ఈ-క్రాప్ నమోదు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పంట నష్టపరిహారం, పంటలు అమ్ముకోవడం తదితర వాటిలో రైతుకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సెప్టెంబర్ ఆఖరిలోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ నట్రాజ్‌తో పాటు ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



హెచ్‌ఎంకు క్రీడా సామగ్రి అందిస్తున్న మల్లికార్జునరెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని వెంకటంపల్లి ఉన్నత పాఠశాలకు వైఎస్సార్‌సీపీ నార్త్ అమెరికన్ అసోసియేషన్ బోర్డు సభ్యులు జెరిపోతుల మల్లికార్జునరెడ్డి రూ.50 వేలు విలువచేసే క్రీడా, ల్యాబ్ పరికరాలను శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు చేయూతనందించాలనే ఉద్దేశంతోనే తాను క్రీడా, ల్యాబ్ పరికరాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మెర్సి హహోనా, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, చిత్రంలో చైర్మన్ అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: రైతు శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖలు అండగా నిలవాలని అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ వేగంగా చేపట్టాలన్నారు. అర్హులైన షెడ్యూల్ కులాల రైతులకు విత్తన కిట్లను సత్వరమే అందజేయాలన్నారు. జిల్లాలో సూక్ష్మబిందు సేద్యం సత్ఫలితాలిస్తోందని అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్‌లను సబ్సిడీపై మరింత మందికి అందజేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కృషి విజ్ఞాన కేంద్రం కోసం రూ.25 కోట్లుతో భవనాలను నిర్మించనున్నారని, అనువైన భూమిని పరిశీలించి ఎంపిక చేసే పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తచెరువు మార్కెట్‌యార్డులో అక్రమాలు చోటు చేసుకున్న విషయాన్ని గతంలోనే అధికారుల దృష్టికి తెచ్చామని ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలను వివరించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ సభ ముందుకు తీసుకొచ్చిన అంశాలను తూచా తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విత్తనాలు వారం రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని ఆర్‌బీకేల్లో నమోదు చేసుకున్న రైతులకు 80 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త సంపత్‌కుమార్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డ్వామా పీడీ రామాంజనేయులు, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రవిచంద్రారెడ్డి, కేశవరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

కలిసుండలేం



☛ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్‌కు చెందిన 24 ఏళ్ల యువతికి పెనుకొండకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో గతేడాది వివాహమైంది. నెల రోజుల వ్యవధిలోనే దంపతుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఈ ఏడాది జనవరిలో పోలీస్ మెట్లు ఎక్కారు. ఇప్పటి వరకూ సమస్య తెగలేదు. పెద్ద మనుషుల సమక్షంలో సర్దిజెప్పినా వినలేదు. పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

☛ జగరాజుపల్లికి చెందిన 36 ఏళ్ల వ్యక్తికి అదే గ్రామానికి చెందిన మహిళతో పదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయిన మూడేళ్ల నుంచి గొడవలు ప్రారంభమయ్యాయి. ఆరేళ్లుగా పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. విడాకులు తీసుకోలేదు. పెద్ద మనుషుల సమక్షంలో కలిసి జీవిస్తామని వెళ్లినా తిరిగి వారం రోజులకే విడిపోయారు. వారి మధ్యలో ఇద్దరు కుమారులు తల్లిదండ్రుల ప్రేమకు దూరం అవుతున్నారు.

☛ గోరంట్లకు చెందిన డిప్లొమా విద్యార్థినికి బాగేపల్లికి చెందిన మెకానిక్‌తో ఏడాది క్రితం వివాహమైంది. మూడు నెలలకే గొడవలు మొదలయ్యాయి. అమ్మాయి పుట్టింటికి చేరింది. సర్దిజెప్పినా వినలేదు. తర్వాత అమ్మాయి ఇంటికే అబ్బాయి వచ్చాడు. నెల రోజుల తర్వాత పంచాయితీ మొదటికొచ్చింది. దీంతో పోలీసులను ఆశ్రయించారు. దంపతుల మధ్య సమస్య కారణంగా ఇరు కుటుంబాల్లో గందరగోళం నెలకొంది.

- చిన్న విషయాలను భూతద్దంలో చూస్తూ..
- భార్యాభర్తల మధ్య పెరిగిపోతున్న విభేదాలు
- పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్న వైనం
- తల్లిదండ్రుల ప్రేమకు దూరమవుతున్న పిల్లలు

సాక్షి, పుట్టపర్తి: వందేళ్లు కలసి బతకాల్సిన వారు చిన్నపాటి కారణాలతో విడిపోతున్నారు. పెళ్లయిన ఆరు రోజుల నుంచి ఆర్నెల్లు గడవకముందే భాగస్వామి అర్థం కావడం లేదనో, అర్థం చేసుకోవడం లేదనో విడిపోవాలనుకుంటున్నారు. జీవితాంతం కలిసి ఉండే బలమైన బంధమే దాంపత్య జీవితం అని గుర్తించలేకపోతున్నారు. ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకోకుండా తమ ఆలోచనల్ని గౌరవించడం లేదంటూ వేదనకు గురవుతున్నారు. ఇద్దరి మధ్య విభేదాల కారణంగా రెండు కుటుంబాల్లో మనస్పర్థలు వస్తున్నాయి. సర్దుకుపోతే ఎలాంటి సమస్య ఉండదని తెలిసినా.. విడాకుల వరకూ వెళ్తున్నారు.

అహమే కారణమా?

ఏడడుగులు నడిచి ఏడాది గడవక ముందే ఎన్నో జంటలు విడిపోతున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి తల్లిదండ్రులకు కన్నీరు మిగిలిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులను పోషించకపోవడం.. మరికొందరు తాగుడుకు బానిసై కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. మనుషుల మధ్య అహంతోనే ప్రతి చిన్న సమస్యనూ భూతద్దంలో చూసి రచ్చకెక్కుతున్నట్లు స్పష్టం అవుతోంది. ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమంలో భార్యభర్తల కేసులు పెరిగిపోతున్నాయి. వచ్చే పిటిషన్లలో మూడింట రెండోవంతు ఉంటున్నాయి.

ఆధిపత్య ధోరణితోనే సమస్యలు

కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరూ సమానమే. బండికి రెండు చక్రాలు సమానంగా.. సరిగ్గా ఉంటేనే ముందుకు వెళ్తుంది. అలా కాకుండా ఒకరు ఎక్కువ.. మరొకరు తక్కువ అనే ధోరణి ప్రదర్శిస్తుండటంతో గొడవలు పెరుగుతున్నాయి. తాము చెప్పిందే భార్య వినాలని కొంతమంది భర్తలు, తాను చెప్పినట్లే చేయాలని భార్యలు ఆధిపత్యం ప్రదర్శిస్తుంటారు. ఆమె మాటను ఆయన గౌరవించకపోవడం, ఆయనకు ఆమె విలువ ఇవ్వకపోవడంతోనే కాపురంలో కలతలు పెరుగుతున్నాయి.

2023లో ఇప్పటి దాకా నమోదైన దంపతుల విభేదాల కేసులు

వివిధ పోలీస్‌స్టేషన్లకు చేరినవి 1,602	పెండింగ్ 306 ఇంకా పంచాయితీ చేస్తున్నారు
మొదటి దశ విచారణలో.. 69	విడాకుల కోసం.. 14 తుదిదశకు చేరినవి
1,213 కలిసే అవకాశం కోసం ఎదురుస్తున్న కేసులు	

సామరస్యంగా మాట్లాడుకుంటే..



దంపతులు మొండి వైఖరి వీడి సామరస్యంగా మాట్లాడుకుంటే నాలుగు గోడల మధ్యనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఎదుటి వారిపై ఆధిపత్యం ప్రదర్శించాలనే ధోరణి మానేయాలి. జీతాలు, హోదాలు ఎన్ని ఉన్నా కుటుంబం ముఖ్యమనే భావనతో మెలగాలి. దంపతుల మధ్య తగాదా వస్తే మూడో మనిషి దగ్గరకు వెళ్లకుండా ఉంటే మంచిది. తప్పెవరిదో తెలిస్తే క్షమాపణ కోరితే పోయేదేమీ లేదు. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా పిల్లలు అనాథలుగా మారుతారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్తగా అవగాహనతో ముందుకెళ్తే మంచిది.

– ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

పోలింగ్ డే

- నేడు పంచాయతీల్లో ఉప ఎన్నికలు
- ఒక సర్పంచు, 13 వార్డులకు పోలింగ్
- పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్న డీపీఓ విజయ్‌కుమార్



హిందూపురం ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులు పరిశీలిస్తున్న డీపీఓ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని పలు పంచాయతీల్లో శనివారం నిర్వహించనున్న ఉప ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన ఒక సర్పంచు, 13 వార్డులకు శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పలు మండలాల్లో పర్యటించిన డీపీఓ ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన సామగ్రిని అందజేశారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

15 స్థానాలు ఏకగ్రీవం

జిల్లాలో మొత్తం 28 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 15 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. హిందూపురం మండలం చలివెందుల సర్పంచ్ స్థానానికి, 13 పంచాయతీల్లో 13 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్‌కు ఇద్దరు పోటీలో ఉండగా 13 వార్డులకు 30 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆగళి 2వ వార్డు, అమడగూరులోని చిన్నగానిపల్లి 3వ వార్డు, అమడగూరు 11వ వార్డు, అమరాపురంలోని నిద్రగట్టలో 4వ వార్డు, బత్తలపల్లి మండలం తంబాపురంలో 3వ వార్డు, బుక్కపట్నం మండలం క్రిష్టాపురంలో 7వ వార్డు, గాండ్లపెంట మండలం మలమీదపల్లి 9వ వార్డు, గోరంట్ల మండల కేంద్రంలోని 18వ వార్డు, గుడిబండ మండలం గునేమోరుబాగల్‌లో 10వ వార్డు, లేపాక్షి మండలం పులమతిలో 10వ వార్డు, రొద్దం మండల కేంద్రంలోని 3వ వార్డు, సోమందేపల్లి మండలం బ్రహ్మసముద్రంలోని 2వ వార్డు, తలుపుల మండలం ఉడుములకుర్తిలో 4వ వార్డులో ఎన్నికలు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం కౌంటింగ్ పూర్తి కాగానే ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



భూమిపూజ నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తిమ్మమ్మమర్రిమానులో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహస్థాపన కోసం నిర్వహించిన భూమిపూజా కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తిమ్మమాంబ, బాలవీరయ్యలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను, తిమ్మమ్మమర్రిమాను విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ కరువు ప్రాంతంలో సుమారు 6000లకు పైగా చెరువులను కట్టించిన ఘనత శ్రీకృష్ణదేవరాయలదని కొనియాడారు. అంతటి మహనీయుని విగ్రహ స్థాపన కోసం నిర్వహించే భూమి పూజలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే తిమ్మమ్మమర్రిమానును ప్రత్యేక గ్రామపంచాయితీ గా తీర్చిదిద్దామన్నారు. ఇప్పటికే సుమారు రూ.కోటి రూపాయల వ్యయంతో తారు రోడ్డు, సీసీ రోడ్డు పనులు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో గెస్ట్‌హౌస్ భవనాన్ని, రెస్టారెంట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి ఈ ప్రాంతంలో రింగు రోడ్డు ఏర్పాటు చేయించాలని కోరారని త్వరలోనే ఆ పనులను చేపడతామన్నారు. తిమ్మమ్మమర్రిమాను అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా కట్టుబడి ఉందని, రాబోవు రోజులలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఓ మంచి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ ఈటెరాము, స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.నారాయణస్వామి, విగ్రహదాత కె.క్రిష్ణమూర్తి, సర్పంచు నాగమునీశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పలు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, హిందూపురం, మడకశిర, ఓడీ చెరువులో బ్లాక్ కోఆర్డినేటర్ మొత్తం 5 ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 19 నుంచి 26 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థుల వయస్సు 2023 జూలై 1వ తేదీ నాటికి 25 సంవత్సరాల నుంచి 42 లోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు సడలింపు ఉంటుందన్నారు. కాంట్రాక్టు కాల పరిమితి ఒక ఏడాది ఉంటుందన్నారు. జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్‌కు రూ.30 వేలు, బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20 వేలు జీతం ఉంటుందని చెప్పారు. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండాలన్నారు. అప్లికేషన్ మెయింటెనెన్స్‌లో రెండేళ్ల అనుభవంతో పాటు తెలుగు చదవడం, రాయడం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ ఉద్యోగానికి రూ.18 వేలు జీతం ఉంటుందని చెప్పారు. మేనేజ్‌మెంట్, సోషల్ సైన్స్‌అండ్ న్యూట్రిషన్‌లో డిగ్రీ ,పీజీ, డిప్లొమా కలిగి ఉండాలన్నారు. టీం సభ్యులకు శిక్షణ ఇవ్వడం, పర్యవేక్షణ అనుభవం రెండు సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. గెజిటెడ్ అధికారితో అటెస్టు చేసిన జిరాక్స్ సర్టిఫికెట్లతో కూడిన దరఖాస్తులను జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి, పుట్టపర్తి, శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సరస్వతీపుత్రునికి చేయూత

- మెడిసిన్‌లో సీటొచ్చిన విద్యార్థికి రూ.1,44,000 అందజేసిన కలెక్టర్
- విద్యారుణం కింద రూ.7.50 లక్షల మంజూరు



విద్యార్థికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పెనుకొండ రూరల్: నీట్‌లో ర్యాంకు సాధించి కర్నూల్ విశ్వభారతి వైద్యకళాశాలలో మెడిసిన్ సీటు సాధించి ఫీజు కట్టేందుకు ఇబ్బంది పడుతున్న అడదాకులపల్లికి చెందిన డేనియల్ నాయక్‌కు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలిచింది. ఇప్పటికే ఆ కుటుంబానికి పెనుకొండ జర్నలిస్టులు రూ.15 వేల ఆర్థికసాయం అందించిన విషయం తెలిసిందే. ఉద్యోగులందరూ కలసి పోగుచేసిన రూ.1,44,000ను కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం గుట్టూరు సచివాలయంలో డేనియల్ నాయక్ కుటుంబ సభ్యులకు చెక్కురూపంలో అందజేశారు. అలాగే రూ.7.50 లక్షలను విద్యారుణం కింద అమ్మవారిపల్లి కెనరా బ్యాంకు వడ్డీలేని రుణాన్ని మంజూరు చేసింది. విద్యాభ్యాసం పూర్తయిన సంవత్సరం తర్వాత విడతల వారీగా డబ్బు చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు లీడ్ డిస్ట్రిక్ డివిజినల్ మేనేజర్ రమణకుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థి డేనియల్ నాయక్‌ను కలెక్టర్ అరుణ్‌బాబు అభినందించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తిక్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ , తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ శివశంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే వందశాతం పూర్తి చేస్తాం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే 83 శాతం పూర్తయిందని మూడు రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా తన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమం సజావుగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5,48,750 ఇళ్లకు సంబంధించి సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 83 శాతం పూర్తయిందన్నారు. వీటిలో డూప్లికేట్ ఓటర్లు 633, ఇల్లు మారిన వారు 1929, మరణించిన ఓటర్లు 6952 గా గుర్తించామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సర్వే చేపట్టామన్నారు. ఇప్పటి వరకూ 100 సంవత్సరాల వయస్సు దాటిన 67 మంది ఓటర్లను గుర్తించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి, ధర్మవరం , కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, మడకశిర ఎన్నికల అధికారి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వ్యవహారంపై విచారణ

చిలమత్తూరు: ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో రవనకుల్లా అనే వ్యక్తిని బెంగళూరుకు తరలించిన ఘటనపై 'సాక్షి'లో ప్రత్యేక కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ అరుణ్ బాబు స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం డీఐఓ డా.కృష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.మంజువాణిలను విచారణ అధికారులుగా నియమించగా వారు చిలమత్తూరు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం విచారణ చేపట్టారు. ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకటేశ్వర్లు నిర్వహిస్తున్న క్లినిక్ వద్దకు వెళ్లి వారు పరిశీలించారు. పక్కనే ఉన్న తన్మయి మెడికల్ స్టోర్‌లో కూడా వారు తనిఖీలు చేశారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద సుదీర్ఘ విచారణ చేపట్టారు. వైద్యం వికటించి ఆస్పత్రి పాలైన రవనకుల్లాతో వారు మాట్లాడి ఏం జరిగిందో ఆరా తీశారు. ఆర్‌ఎంపీ మూడు ఇంజక్షన్లు ఇచ్చినట్లు వారు నిర్ధారించారు. ప్రస్తుతం రవనకుల్లా ఆరోగ్యం నిలకడగా ఉందని, అతని ఆరోగ్య పరిస్థితిపై, జరిగిన సంఘటనపై కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి నివేదిక అందజేస్తామన్నారు. తప్పు చేశాడు కాబట్టే సదరు ఆర్‌ఎంపీ పరారీలో ఉన్నాడని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని ఆర్‌ఎంపీలతో సమావేశాన్ని నిర్వహించారు. నిబంధనలకు లోబడే వైద్యం చేయాలని ఆదేశించారు.

అందుబాటులో ఉండి సేవలందించండి


మార్కెట్‌యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: రైతులు, వ్యాపారులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో నూతన పెనుకొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా కలిపి దేవాంగం శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీనివాసులు మాట్లాడుతూ తనకు మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డైరెక్టర్లుగా నరేంద్రరెడ్డి, పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, తిమ్మయ్య, ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణరెడ్డి, రాజారెడ్డి, మండల అగ్రి చైర్మన్ కొండలరాయుడు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప, పట్టణ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య

ప్రశాంతి నిలయం: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలకు డీఈఓ మీనాక్షి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉచిత విద్య అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తెలిపారు.

మత్స్యకారుల జీవనోపాధి మెరుగునకు కృషి

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ


ఫిష్ ఆంధ్ర యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

పెనుకొండ రూరల్: మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. శుక్రవారం ఫిష్ ఆంధ్ర డెలిషియస్ రెస్టారెంట్‌ను కియా పరిశ్రమ మెయిన్ గేట్ వద్ద ఎమ్మెల్యే శంకరనారాయణ, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్య సాయి జిల్లాలో మొదటిసారిగా ఫిష్ ఆంధ్రా డెలిషియస్ రెస్టారెంట్ యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కోస్తా ప్రాంతాలకే పరిమితమైన ప్రత్యేక రుచికరమైన చేపలను ఫిష్ ఆంధ్ర డెలిషియస్ రెస్టారెంట్ ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. అందులోభాగంగానే డెలిషియస్ యూనిట్లను ప్రారంభించి, రాయితీలు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు మహిళలకు 60 శాతం రాయితీని కల్పించిందన్నారు. రూ.10లక్షల యూనిట్‌కు రూ.1.50 లక్ష చెల్లిస్తే మిగిలిన మొత్తం బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. జిల్లాకు 24 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. సబ్ కలెక్టర్ కార్తిక్, ఎమ్మెల్సీ మంగమ్మ, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ శివశంకరప్ప, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, సర్పంచ్ అశ్వర్థనారాయణ, నాయకులు రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, శ్యామునాయక్, మండల కన్వీనర్ నాగళూరు బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓగా భరత్ చవాన్ ఎంపిక


భరత్ చవాన్

సోమందేపల్లి: మండలంలోని నాగినాయని చెరువు తండాకు చెందిన బాపూజీనాయక్ కుమారుడు భరత్ చవాన్ గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ చాటి ఆర్డీఓగా ఎంపికయ్యాడు. తండ్రి ఓఎన్జీసీ రాజమండ్రిలో జనరల్ మేనేజర్‌గా, తల్లి విజయబాయి ఉరవకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. కాగా కర్నూలు పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన భారత్ చవాన్ హైదరాబాద్‌లో గ్రూప్స్‌కు శిక్షణ తీసుకున్నాడు. ఇదే తండా నుంచి వర్షిణి బాయి సీటీఓగా ఎంపికయ్యింది.

వ్యక్తి బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న ఆంజనేయులు

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని బసప్పగారిపల్లికి చెందిన ఆంజనేయులు (59) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ గోపీ తెలిపిన మేరకు.. ఆంజనేయులు తనకున్న 4 ఎకరాల పొలంలో 3 బోరు బావులను తవ్వించినా నీరు పడలేదు. దీనికితోడు మూడు నెలల క్రితం పాడి ఆవు మృతి చెందగా రూ. 70 వేలు వెచ్చించి మరో పాడి ఆవును కొనుగోలు చేశాడు. అదికూడా అనారోగ్యానికి గురైంది. దీంతో మనస్థాపం చెంది గ్రామం సమీపంలోని చింత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డెంగీ లక్షణాలతో యువకుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని నల్లరాళ్లపల్లి గ్రామంలో డెంగీ లక్షణాలతో అమర్నాథ్ (20) శుక్రవారం మృతి చెందాడు. మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న అమర్నాథ్‌ను అనంతపురంలోని సవీరా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తాం

- ఎస్పీ మాధవరెడ్డి


పోలీసుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులకు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెలలో మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా తమ చాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుల నుంచి ఆరు వినతులు అందాయన్నారు. వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన వెంకట్రాముడు

ధర్మవరం రూరల్: పట్టణంలోని యాదవవీధికి చెందిన వెంకట్రాముడు (45)శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు యర్రగుంట వద్ద ఉన్న హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య గంగా, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలసికట్టుగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

- ఎండోమెంట్ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్


మాట్లాడుతున్న ఎండోమెంట్ ప్రభుత్వ సలహాదారు శ్రీకాంత్

కదిరి టౌన్: ఆలయ చైర్మన్, ఈఓ, అర్చకులు అందరూ కలసికట్టుగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎండోమెంట్ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆలయ ఈఓ, అర్చకులు అంజన్‌కుమార్ స్వామి ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆలయ ఈఓ, అర్చకుడు ఇద్దరినీ కలిపి మాట్లాడామన్నారు. అందరినీ కలుపుకొని ఆలయ అభివృద్ధి దిశగా పనిచేయాలని తెలిపినట్లు తెలిపారు. కొందరు అర్చకులు, ఈఓ శ్రీనివాసరెడ్డి, అంజన్‌కుమార్‌కు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ప్రధాన అర్చకులు, నరసింహాచార్యులు, పార్థసారథిచార్యులు, కుమార్‌స్వామి, అంజన్‌కుమార్ స్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కృషి


చెక్కు అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, అదనపు ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ భార్య అంజలీకుమారికి ఎస్పీ చాంబర్‌లో ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ విష్ణు రూ.75 వేల చెక్కు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. గత నెలలో అనారోగ్యంతో మృతి చెందిన కిరణ్‌కుమార్ భార్యకు విడో ఫండ్ కింద రూ.50వేలు, కార్పస్ ఫండ్ కింద రూ.25వేలు అందించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, ఎస్‌బీ సీఐ రవీంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


ఫిరోజ్‌ఖాన్ (ఫైల్)


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: నంబులపూలకుంట మండల కేంద్రం సోలార్ పవర్ ప్రాజెక్ట్‌లోని అయ్యనా కంపెనీలో పని చేస్తున్న ఫిరోజ్‌ఖాన్ (26) విద్యుత్‌షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. వివరాలు..సోలార్ ప్రాజెక్ట్‌లో అయ్యనా కంపెనీలో పని చేస్తున్న ఫిరోజ్‌ఖాన్ గ్రాస్ కటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి అమీర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ :

కదిరి ప్రభుత్వాస్పత్రిలో ఉన్న ఫిరోజ్‌ఖాన్ మృతదేహాన్ని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి సందర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టు

పుట్టపర్తి : బుక్కపట్నం మండలంలోని శ్రీ సత్యసాయి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి రాష్ట్రస్థాయికి మొత్తం 24 మంది ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 8 నుంచి 10 వరకూ నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు.